

నేడు రక్తదాన శిబిరం : ఎస్సై

ఆదిలాబాద్(గుడిహత్నూర్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించ తలపెట్టినట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా మండలంలోని యువత రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసి పోలీసు అమరవీరుల త్యాగాలకు నివాళి అర్పించాలని కోరారు. రక్తదానం చేయాలనుకునే వారు ఫోన్ నెం.8712659946, 8712659936 ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆదివాసీ సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

● ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ● జిల్లాలో కొనసాగుతున్న దండారీ ఉత్సవాలు



తాంసి మండలం అంబుగావ్ గుస్సాడీలతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

వివరాలు 7వ పేజీలో

ఘనంగా గోదాన్ పూజలు



సావర్గామ్‌లో పూలను సేకరిస్తున్న గిరిజన యువతులు

6వ పేజీలో...

పత్తి కొనుగోళ్లకు.. సన్నద్ధం



● మార్కెట్‌కు తీసుకొచ్చిన పత్తి (ఫైల్)

- జిల్లావ్యాప్తంగా 11 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఈసారి క్వింటాలు మద్దతు ధర రూ.8110
- అక్టోబరు 27న పత్తి సేకరణకు ముహూర్తం ఖరారు
- దిగుబడుల పైనే అన్నదాతల ఆందోళన
- జిల్లాలో ఈయేడు 4.31లక్షల ఎకరాల్లో సాగైన పత్తి పంట

పత్తి పంట కొనుగోళ్లకు.. మార్కెటింగ్ శాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ ఈయేడు జిల్లాలో 4 లక్షల 31వేల ఎకరాల్లో పత్తి పంట సాగైనట్లు అధికారు లు పేర్కొంటున్నారు. ఈసారి వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో దిగుబడులపై అనుమానా లు వ్యక్తమవుతున్నాయి. సుమారుగా 30 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పత్తి పంట కొనుగోళ్లపై దృష్టి సారించాలని కలెక్టర్ రాజార్షిషా అధికారులను ఆదేశించడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. ఇప్పటికే అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించి కొనుగోళ్లపై రైతు సంఘాల నేతలు, రాజకీయ పార్టీల నేతల అభిప్రాయాలను తీసుకున్నారు.

ఆదిలాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దసరా పండుగ తర్వాత పత్తి కొనుగోళ్లను ప్రారంభించాల్సి ఉండగా.. కురుస్తున్న వర్షాలతో కొనుగోళ్ల ప్రక్రియ కొంత ఆలస్యమవుతోంది. అనుకున్నట్లుగానే వాతావరణ పరిస్థితులు సహకరిస్తే ఈనెల 27 నుంచి పత్తి కొనుగోళ్లను ప్రారంభించాలని అధికారులు ముహూర్తం ఖరారు చేశారు. జిల్లావ్యాప్తంగా 11 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మొదట జిల్లాకేంద్రంలోని ఏ, బీ సెంటర్లలో పత్తి కొనుగోళ్లను ప్రారంభించి.. ఆ తర్వాత నవంబరు మొదటి వారంలో మిగితా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు. ప్రస్తుతం బయట మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6500 ధర పలుకుతుంది. సీసీఐ ఏర్పాటు చేసే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్ పత్తి మద్దతు ధర రూ.8110 దక్కనుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో భారీగానే డిమాండ్ కనిపిస్తున్నా.. దిగుబడులపైనే అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.



11 కొనుగోలు కేంద్రాలు

జిల్లావ్యాప్తంగా ఈసారి 11 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కెటింగ్ శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా కేంద్రంలో ఏ, బీ సెంటర్లు, బోథ్, సోనాల, నేరడిగొండ, పొచె ్చర, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, బేల, జైనథ్, నార్నూర్ మండలాల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అయితే 8 నుంచి 12శాతం తేమ ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ఆ పైగా తేమ ఉంటే కొనుగోళ్లకు అవకాశం ఉండదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఆరబెట్టిన నాణ్యత గల పత్తిని మార్కెట్‌కు తరలించి మద్దతు ధర పొందాలని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ప్రారంభంలో 20 వరకు తేమ శాతం ఉన్న పత్తిని కూడా సీసీఐ అధికారులు కొనుగోలు చేయాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ప్రతిసారి తేమ పైననే రైతులు ఆందోళనకు దిగుతున్న సీసీఐ మాత్రం నిబంధనలను ఎత్తివేయడం లేదంటున్నారు. తేమ నిబంధనలతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతు సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా తేమ నిబంధనలను పకడ్బందీగా అమలు చేసేందుకు సీసీఐ సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది.

తేమ శాతం.. మద్దతు ధర ఇలా..

8 తేమ శాతం	:రూ.8110
9 తేమ శాతం	:రూ.8028
10 తేమ శాతం	:రూ.7947.80
11 తేమ శాతం	:రూ.7866.70
12 తేమ శాతం	:రూ.7785.60

స్లాట్ బుక్ చేసుకోవాల్సిందే..

మునుపెన్నడూ లేనివిధంగా ఈసారి సీసీఐ పత్తి కొనుగోళ్లలో కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. కపాస్ కిసాన్‌యాప్ ద్వారా పత్తి రైతులు మొదట స్లాట్ బుక్ చేసుకున్న తర్వాతనే పత్తిని మార్కెట్‌కు తరలించాల్సి ఉంటుంది. ప్రతీ రైతు స్మార్ట్ ఫోన్‌లో కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దాని ద్వారానే పత్తిని విక్రయించాలని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఈ యాప్ ద్వారా రైతులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన అఖిలపక్ష సమావేశంలోను కపాస్ కిసాన్ యాప్‌ను రైతు సంఘాల నేతలు తీవ్రంగా

(తరువాయి 6వ పేజీలో....)

నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి

: గజానంద్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి



రైతులు నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి మద్దతు ధరను పొందాలి. ప్రస్తుతం బయట మార్కెట్‌లో క్వింటాల్ పత్తికి రూ.6500ల ధర ఉంది. చిన్నపాటి మెలకువలు పాటిస్తే మద్ధతు ధర దక్కే అవకాశం ఉంటుంది. రైతులు మార్కెట్‌కు వచ్చే టప్పుడు ఆధార్‌కార్డు, పట్టాపాస్‌పుస్తకం, మొబైల్‌ఫోన్‌ను వెంట తీసుకురావాలి. 12 తేమ శాతం కంటే ఎక్కువ తేమ ఉన్న పత్తిని ఎట్టి పరిస్థితుల్లో సీసీఐ కొనుగోలు చేయదు. రైతుల సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్ 7330733421ను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి శనివారం, ఆదివారం మార్కెట్‌కు సెలవు ఉంటుంది. రైతులు నిబంధనల ప్రకారం పత్తిని మార్కెట్‌కు తరలించి అమ్ముకోవాలి.

27 నుంచి పత్తి కొనుగోళ్లు : జిల్లా అధికారి

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27వ తేదీ నుంచి పత్తి కొనుగోళ్లను ప్రారంభించేందుకు జిల్లా మార్కెటింగ్ శాఖ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లా మార్కెటింగ్ అధికారి వివరాలను వెల్లడించారు. 8 శాతం తేమ కలిగిన పత్తికి క్వింటాల్‌కు రూ.8110 కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. సీసీఐ ద్వారా, ప్రైవేట్ వ్యాపారుల ద్వారా కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుందని, ఈనెల 34 నుంచి కిసాన్ కపాస్ యాప్ ద్వారా స్లాట్‌లు బుక్ చేసుకునే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. కనీస మద్దతు ధర దక్కాలంటే రైతులు తమ పంటను ఎండబెట్టుకుని రావాలని సూచించారు. ప్రతి శని, ఆది వారాలు మార్కెట్ బంద్ ఉంటుందని పేర్కొన్నారు. రైతుల సమస్యలపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 7330733421 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

తెలంగాణ రైజింగ్-2047 సిటిజన్ సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి : కలెక్టర్

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్ సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కలెక్టర్ రాజర్షి షా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనలో ప్రతీ పౌరుడి భాగస్వామ్యం కీలకమని, అందువల్ల తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వేలో అందరూ తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సర్వేకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల ప్రజలు తమ విలువైన సూచనలు, అభిప్రాయాలను అందజేశారని తెలిపారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో? ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఈ సిటిజన్ సర్వేను ప్రారంభించినట్లు ఆయన వివరించారు. గత వారం ప్రారంభమైన ఈ సర్వే ఈనెల 25వ తేదీతో ముగుస్తుందని, జిల్లా ప్రజలు వెబ్‌సైట్ ద్వారా తమ అమూల్యమైన సలహాలు, సూచనలను నమోదు చేయాలని ఆయన సూచించారు. శక్తివంతమైన, అభివృద్ధి చెందిన తెలంగాణ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం అత్యవసరమని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పిండి వంటకాలు అందించి.. శుభాకాంక్షలు!

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు కలెక్టర్ రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలతో పాటు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి కలెక్టర్‌కు పండగ రోజున జిల్లా వాసులు ప్రత్యేకంగా తయారు చేసుకునే పిండి వంటకాల్ని అందించారు. జిల్లా కలెక్టర్ ఆసక్తిగా వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీపావళి పండుగకు పిండి వంటకాలను తయారు చేసుకోవడం ప్రత్యేకంగా నిలుస్తుందని ఈ సందర్భంగా ప్రమోద్ ఖత్రి ఆయనకు వివరించారు. అదేవిధంగా ఎంపీ గోడం నగేష్ జన్మదినం సందర్భంగా ఆయనను కలిసి సమితి సభ్యులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళి సమర్పించారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి పడకంటి సూర్యకాంత్, కార్య నిర్వహక కార్యదర్శి కందుల రవీందర్, సుబాష్ ఉరాడే, దశరథ్, భానోత్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ముక్రా(కె)లో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

సోయా కొనుగోళ్లను ప్రారంభించాలి

ఇచ్చోడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సోయాబీన్ పంట కొనుగోళ్లను ప్రభుత్వ వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ముక్రా(కె) గ్రామంలో రైతులు సోయాబీన్ పంట ముందు నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా సోయాబీన్ పంటను దళారులు రూ.1500లకు తక్కువగా కొనగోలు చేస్తున్నారని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పంట కొనగోళ్లను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ముక్రా(కె) గ్రామ రైతులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' నిర్మాణ పనుల పరిశీలన

బోథ్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని మంగళవారం ఎంపీడీవో రమేష్ పరిశీలించారు. ఇళ్లను సకాలంలో పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను ఉపాది పథకానికి అనుసంధానం చేయడం ద్వారా రూ.27 వేలు అందించడం జరుగుతుందని వివరించారు. లబ్ధిదారులు ఉపాధి కార్డును ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు.



టపాసులు కాల్చుతున్న చిన్నారులు



పూజల్లో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి దంపతులు



సతీమణి రమతో టపాసులు కాలుస్తున్న మాజీ మంత్రి రామన్న



ఉట్నూర్‌లో లక్ష్మి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జిల్లాలో ఘనంగా దీపావళి

జిల్లాలోని ఆదిలాబాద్, ఉట్నూర్, బోథ్, తలమడుగుతో పాటు ఆయా మండలాల్లో దీపావళి సంబురాలు అంబరాన్నంటాయి. అలాగే, ఇళ్లలో, వ్యాపార సంస్థల్లో ధనలక్ష్మి పూజలను వైభవంగా చేశారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా అందరూ పెద్దఎత్తున టపాకాయలను కాల్చడంతో అంతటా పండుగ శోభ నెలకొంది.



ఉట్నూర్ కామైపేట్‌లో దీపావళి సందర్భంగా గుస్సాడీ దండారీ వేడుకలు నిర్వహిస్తున్న ఆదివాసీ గిరిజనులు



తలమడుగు ప్రాథమిక సహకార సంఘ కార్యాలయంలో పూజలు నిర్వహిస్తున్న చైర్మన్ దామోదర్ రెడ్డి





దీపాలు వెలిగిస్తున్న యువతి



నివాళ్లు అర్పిస్తున్న అమరవీరుల కుటుంబ సభ్యులు

పోలీసు అమరుల త్యాగం చిరస్మరణీయం

● ఫ్లాగ్ డే సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధుల ఘన నివాళి

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మంగళవారం స్థానిక ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ప్రాంగణంలోని అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణలో, దేశ సరిహద్దుల రక్షణలో విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, ప్రజాప్రతినిధులు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమానికి జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్ రావు విశిష్ట అతిథిగా, ముఖ్య అతిథులుగా ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఇతర అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు స్తూపం వద్ద పుష్పగులతో నివాళులు అర్పించారు. రాష్ట్రంలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అమరవీరుల ముఖ చిత్రాలతో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం ప్రత్యేక గుర్తింపు పొందింది. కార్యక్రమం ప్రారంభంలో ఉన్నతాధికారులు స్తూపం వద్ద జ్యోతి వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సాయుధ పోలీసులు శస్త్రసల్యూట్‌తో అమరవీరులకు గౌరవ వందనం సమర్పించారు. శోక శస్త్ర ద్వారా సలామి ఇచ్చి, రెండు నిమిషాల మౌనం పాటించి అమరవీరుల ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ కుటుంబాలను పక్కన పెట్టి ప్రజల రక్షణ కోసం ప్రాణాలు అర్పించడం పోలీసులు మాత్రమే చేయాలని తెలిపారు. వారి సేవలు నిస్వార్థమైనవి, త్యాగపూరితమైనవని అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ 1959 అక్టోబరు 21న లడక్ సమీపంలోని హాట్ గ్ ప్రాంతంలో చైనీయుల దాడిలో పదిమంది సీఆర్పీఎఫ్ జవాన్‌లు వీరమరణం పొందారని, ఆ సంఘటనను స్మరించుకుంటూ ప్రతీయేడు అక్టోబరు 21న అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) బి.సురేందర్ రావు, డీఎస్పీలు ఎల్.జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, హసీబుల్లా, కమతం ఇంద్రవర్ధన్, డీఎంహెచ్‌ఓ నరేంద్ర రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జయసింగ్ రాథోడ్, ఆర్టీసీ ఆర్‌ఎం, తదితరులున్నారు.

ఉట్నూర్: మండల కేంద్రంలోని పోలీసులు, పాఠశాలల విద్యార్థులు, రాజకీయ పార్టీల నాయకులు మంగళవారం ఫ్లాగ్‌డే ఘనంగా నిర్వహించారు. ఉట్నూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మడావి ప్రసాద్, సబ్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో ఉన్న పోలీసు అమరవీరులు కొటియనాయక్, తాహెర్‌అహమ్మద్, గోవర్ధన్‌లా స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉట్నూర్‌లో ర్యాలీ నిర్వహించి పోలీసు అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. ఏఎస్సై రాములు, రిజర్వు పోలీసులు, సివిల్ పోలీసులు పాల్గొన్నారు. కాగా, బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి పార్టీ నాయకులతో కలిసి ఘన నివాళులు అర్పించారు.



బోరిగామలో టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి రాథోడ్ జీవన్

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

నేరడిగొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక రైతు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి అధికారి రాథోడ్ జీవన్ అన్నారు. సోమవారం మండలంలోని బోరిగామ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ పశుపోశకులు విధిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని సూచించారు.

ఘనంగా గోదాన్ పూజలు

నేరడిగొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గ్రామాలలో మంగళవారం గోదాన్ పూజలను ఘనంగా జరుపుకున్నారు. గిరిజన గ్రామాలలో పెళ్లి కాని యువతులు గ్రామ పొలిమేరలలో గల అడవుల నుంచి రంగురంగు పూలను సేకరించి ప్రతీ ఇంటి ముందర గొబ్బెమలను ఏర్పాటు చేసి గొబ్బెమ్మలల్లో తమ సంప్రదాయ పాటలు పాడుకుంటూ పూజలు చేస్తారు. అలా చేయడం వలన గ్రామంలో సుఖశాంతులు నెలకొంటాయని, అలాగే పెళ్లి కాని యువతులు ఈ పూజలు చేయడం వలన పెళ్లి అవుతుందని వారి నమ్మకం. అనంతరం గ్రామ పెద్ద నాయక్ ఇంటి వద్ద సామూహిక అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. తాజాగా మంగళవారం సాత్నాల మండలం మేడిగూడ(ఆర్) గ్రామం నుంచి పలువురు బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కంది శ్రీనివాస రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. గిమ్మ సంతోష్ రావు, క్యాతం శివప్రసాద్ రెడ్డి, తదితరులున్నారు.

ఘనంగా రాథోడ్ రమేష్ జయంతి

ఉట్నూర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ జయంతి కార్యక్రమాలను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు మండలంలోని నాగపూర్ పంచాయతీ పరిధిలో ఉన్న రాథోడ్ రమేష్ స్మృతి వనం వద్ద ఏర్పాటు చేసిన రమేష్ విగ్రహానికి కుటుంబ సభ్యులు, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, రాహుల్ రాథోడ్, మహిళ మోర్చా నాయకురాలు జాదవ్ సుమాన్‌బాయి, ప్రజా సంఘాల నాయకులు జగన్‌నాయక్, బానోత్ రామారావు, నేతావత్ రాందాస్, రవినాయక్, ఉట్నూర్ మండల బీజేపీ అధ్యక్షుడు బింగి వెంకటేష్, కొండేరి రమేష్, రాథోడ్ శేషరావు, తదితరులు పాల్గొన్నారు.



నివాళ్లర్పిస్తున్న కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు

పీవీటీజీ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

● చించోలిలో 48 మందికి ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఇంటి మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



రాజురాలో దుప్పట్లు పంపిణీ చేస్తూ..

నేరడిగొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చించోలి గ్రామంలో మంజూరు అయిన 48 పీవీటీజీ ఇళ్ల మంజూరు పత్రాలను మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ లబ్ధిదారులకు అందజేశారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఆదివాసీ బిడ్డలందరికీ ఇండ్లు వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శేఖర్ నాయకులు మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, జంగు, రాథోడ్ సురేందర్, అనిల్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, సుజీల్, కేమ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన గ్రామానికి అండగా..

నేరడిగొండ: మండలంలోని తన స్వగ్రామం రాజురా లో దీపావళి పండుగ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సొంత డబ్బులతో గ్రామంలో గల నిరుపేద కుటుంబాలకు దుపట్లు, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ అందరి ఇంట్లో దీపావళి జరగాలని, తనను పెంచి పెద్ద చేసిన రాజురా గ్రామానికి అన్ని రకాలుగా అండగా ఉంటానని తెలిపారు. గ్రామంలో ఉన్న వారందరూ తన కుటుంబ సభ్యులేనని, రానున్న రోజుల్లో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు.ఆయనవెంట స్థానిక నాయకులు ఉన్నారు.



ఎంపీని సన్మానిస్తున్న బోథ్ మండల నాయకులు



ఎంపీని గజమాలతో సన్మానిస్తున్న బీజేపీ తలమడుగు నాయకులు

ఘనంగా ఎంపీ నగేష్ జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ నేతలతో పాటు ఆయన అభిమానులు స్వగృహానికి చేరుకుని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా ఎంపీకి ఫోన్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్‌తో పాటు పలువురు నాయకులు ఎంపీని శాలువాలతో సన్మానించి జన్మదిన వేడుకలు జరిపారు.

బోథ్: ఎంపీ జి.నగేష్‌ను మంగళవారం బోథ్ మండల నాయకులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బోథ్ పట్టణ అభివృద్ధి అధ్యక్షులు అల్లకొండ పోతన్న మాజీ ఎంపీపీ అప్పకిషన్ న్యాయవాది పి.శంకర్ మాజీ సర్పంచ్ విశ్వేశ్వర్ పాట్నాపూర్, మాజీ సర్పంచ్ తొడసన్ గోపాల్, విజయ్, బోథ్ మండల బీజేపీ అధ్యక్షులు బోరే రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: తలమడుగు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్లమెంటు సభ్యుడు గోడం నగేష్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తన నివాసంలో భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి గజమాలతో సత్కరించి జన్మదిన వేడుకలు నిర్వహించారు. భవిష్యత్తులో మంచి పదవులు ప్రజలకు మరింత సేవ చేయాలని బిజెపి నాయకులు కోరారు. ఇందులో బిజెపి పార్టీ జిల్లా నాయకులు కనపర్తి చంద్రకాంత్, మాజీ జెడ్పిటిసి ప్రభాకర్, బోండ్ల వెంకటస్వామి, సుంకిడి మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, కజర్ల మాజీ ఎంపీటీసీ షార్ధ స్వామి, బరంపూర్ నారాయణరెడ్డి మాజీ ఎంపిటిసి హనుమంతు, జరీ భుజంగరావు, ప్రేమిందర్ రెడ్డి, ప్రశాంతరావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

పత్తి కొనుగోళ్లకు.. సన్నద్ధం

(5వ పేజీ తరువాయి...)

వ్యతిరేకించారు. నిరక్ష్యరాస్యులైన రైతులు స్లాట్ బుక్ చేసుకోవడం ఇబ్బందికరంగా ఉంటుందని పేర్కొన్నారు. అయిన సీసీఐ యాప్ ద్వారానే పత్తిని కొనుగోలు చేసేందుకు ముందుకెళ్తుంది. దీని ద్వారా పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతుందన్న అదేస్థాయిలో రైతులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం లేకపోలేదంటున్నారు. ప్రతిరైతుకు స్మార్ట్ ఫోన్ లేక పోవడంతో ఇతర రైతులపై ఆధారపడాల్సిన అవసరం ఉందంటున్నారు. ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి గందరగోళంగా మారనుంది. భూ యజమానులు ఓటీపీని నిర్ధారిస్తేనే పత్తిని అమ్ముకునే అవకాశం ఉంటుంది. అలాగే టెంపరరీ రిజిస్ట్రేషన్‌లలో గతేడు ఎన్నో అక్రమాలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. మళ్లీ ఈ సారి కూడా టెంపరరీ రిజిస్ట్రేషన్ల ద్వారా అవకాశం కల్పిస్తే అక్రమాలు జరిగే అవకాశం ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నిబంధనల సడలింపునకు పట్టు

తేమశాతం నిబంధనలు సడలించాలని రైతులు పట్టుబడుతున్నారు. ఎందుకంటే ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో భారీ మార్పుల కారణంగా పత్తిలో తేమ అధికంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. అలాగే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తిని ఆరబెట్టడం కొంత ఇబ్బందికరంగానే ఉంటుందని చెబుతున్నారు. జిల్లాలో నల్లరేగడి నేలలే అధికంగా ఉండడంతో సాధారణంగా పత్తిలో తేమ అధికంగా ఉంటుందని దీంతో మద్దతు ధర దక్కడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీసీఐ మాత్రం 8 నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేసేందుకు నిబంధనలు తీసుకు రావడం సరైంది కాదంటున్నారు. జనవరి, ఫిబ్రవరి వరకు 20 శాతం తేమ ఉన్న పత్తిని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్లు చేస్తున్నారు. తేమ నిబంధనలతో మద్ధతు ధర దక్కడం గగనమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.తేమ శాతం పేరిట ధరల్లో కోతలు విధిస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉందంటున్నారు. తేమ శాతం పై రైతుల్లో ముందస్తు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. కానీ వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ అధికారులు ఇప్పటికే జిల్లాలోని ఏ ఒక్క గ్రామంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించిన దాఖలాలు కనిపించడం లేదు. ఆదరబాధరగా పత్తిని అమ్ముకునేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సీసీఐ కొనుగోలు చేయకుంటే సిండికేటుగా మారిన ప్రైవేట్ వ్యాపారులతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందంటున్నారు. సీసీఐ అధికారులతో కుమ్మకవుతున్న పలువురు ప్రైవేట్ వ్యాపారులు ఈసారి అడ్డగోలుగా దండుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది.

అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతానికి పాలన పథకం కీలకం

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బాలరక్షక్ భవన్‌లో మంగళవారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాలన పథకంపై ఐసీడీఎస్ సిబ్బందికి ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. పాలన పథకం లక్ష్యాలు, అమలు విధానం, డేటా సేకరణ పద్ధతులు, మొబైల్ అప్లికేషన్ వినియోగం, తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. రాష్ట్ర లీడ్ రాజారామ్ ప్రసాద్, ప్రోగ్రామ్ అధికారి మాణికప్ప ప్రధాన శిక్షణదారులుగా పాల్గొన్నారు. అనంతరం రిక్షా కాలనీ, సంజయ్ నగర్, మహాలక్ష్మి వాడ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, కేంద్రాల పనితీరును పరిశీలించారు. అనంతరం అధికారులు కలెక్టర్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, పూలమొక్కను అందజేశారు. పాలన పథకం అమలు పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాలన పథకం అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని, పిల్లలు, గర్భిణులకు శారీరక, మానసిక అభివృద్ధికి సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా పథకం కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది సమగ్రంగా పనిచేస్తే గ్రామస్థాయిలో సానుకూల మార్పులు కనిపిస్తాయని పేర్కొన్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి మిల్కా, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, సీడీపీవోలు సౌందర్య, శారద, ఉమాదేవి, నర్సమ్మ, వినూత్న, డీఎంసీ యశోద, సూపర్‌వైజర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బాధనకుర్తిలో మాట్లాడుతున్న ఎంపీ నగేష్

ప్రజల కోసం తపించిన నేత రమేష్ రాథోడ్

» ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్

» బాధనకుర్తిలో రమేష్ రాథోడ్ విగ్రహ ఆవిష్కరణ

ఖానాపూర్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం నిరంతరం పరితపించిన నేత దివంగత మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ అని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ కొనియాడారు. సోమవారం రమేష్‌రాథోడ్ జయంతిని పురస్కరించుకుని ఖానాపూర్ మండలంలోని బాధనకుర్తిలో రమేష్ రాథోడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ నగేష్ హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యేగా, జడ్పీచైర్మన్‌గా, ఎంపీగా రమేష్‌రాథోడ్ సేవలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై చెరగని ముద్రని అన్నారు. ఖానాపూర్ మండలంలోని బాధనకుర్తి గ్రామ ప్రజల కష్టాలు తీర్చేందుకు రాథోడ్ రమేష్ కృషి ఎనలేనిదన్నారు. అప్పటి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల మధ్య గోదావరి నదిపై రెండు వంతెనల నిర్మాణం చేయడంలో రాథోడ్ ఎంతగానో శ్రమించారన్నారు. పార్టీలకు అతీతంగా తన వద్దకు వచ్చిన ప్రతీ వ్యక్తికి సహాయపడే గొప్ప ఔన్నత్యం కలిగిన నాయకునిగా రాథోడ్ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. అనంతరం రమేష్ రాథోడ్ కుమారుడు బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ మాట్లాడుతూ నిరంతరం ప్రజలతో మమేకమై వారి కష్టాలను పరిష్కరించడంలో తన తండ్రి ముందుండే వారన్నారు. నేటి తరం నాయకులకు ఆదర్శప్రాయుడిగా రాథోడ్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో రమేష్ రాథోడ్ కుమారుడు రాథోడ్ రాహుల్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆకుల శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్, మండలాధ్యక్షుడు పుప్పాల ఉపేందర్, పట్టణాధ్యక్షుడు కీర్తి మనోజ్, జిల్లా నాయకులు నల్ల రవీందర్ రెడ్డి, రవీందర్, ఇతర పార్టీల నాయకులు, తదితరులున్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

ముథోల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండల కేంద్రానికి చెందిన లైన్ ఇన్‌స్పెక్టర్ సిరిగిరి సాయినాథ్ కుమార్తె సిరిగిరి సౌమ్య ఎంబీబీఎస్‌లో ప్రతిభ కనబరిచి సీటు సాధించారు. అయితే ముథోల్ నాయకులు పలువురు మంగళవారం విద్యార్థినిని అభినందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తాలూకా సంఘం అధ్యక్షుడు రోళ్ల రమేష్, వీడీసీ కార్యవర్గ సభ్యులు పోతన్న, భోజన్న, జంగిలి పోతన్న, చిన్నకరోళ్ల బాబు, వీడీసీ మాజీ అధ్యక్షులు నారాయణ, మాజీ క్యాషియర్ సాయినాథ్, గడ్డం సురేష్, సంగోళ్ల సాయినాథ్, గణేష్, మాజీ వార్డు సభ్యులు వెంకటేష్, ఎం.విఠల్, భూమేష్, సాయినాథ్, బీసీ జేఏసీ ముథోల్ మండల ఉపాధ్యక్షుడు గడ్డం సుభాష్ పాల్గొన్నారు.



విద్యార్థిని సిరిగిరి సౌమ్యను సన్మానిస్తున్న దృశ్యం

గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందించాలి

» ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్

భైంసా, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నీట్ ద్వారా ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన విద్యార్థులు వైద్యవృత్తిలో ప్రావీణ్యతను సాధించి గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ అకాంక్షించారు. మంగళవారంరాత్రి భైంసాలో ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన ముథోల్‌నియోజకవర్గ ప్రాంతవిద్యార్థులకు అనసూయ పవార్ ట్రస్టు ద్వారా నిర్వహించిన సన్మాన సభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వైద్య విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించి వైద్య రంగంలో నిష్ణాతులుగా ఎదగాలని సూచించారు. జీవిత లక్ష్యసాధనకు ప్రణాళికాబద్ధమైన విధానాల ద్వారా ముందుకు సాగాలని సూచించారు. ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ నీట్ ఫలితాల తరహాలోనే వైద్యవిద్యలోనూ ప్రతిభను కనబరిచాలని అకాంక్షించారు. ప్రముఖ క్యాన్సర్ స్పెషలిస్టు డా. సతీష్‌పవార్, భైంసా, ముథోల్ ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు డా.కాశీనాథ్, డా. అనిల్, భైంసా ఏరియా ఆసుపత్రి స్త్రీ వైద్య నిపుణురాలు డా.బోస్లే పద్మావతి కిషోర్ పాటిల్‌లు వైద్యవిద్యకు సంబంధించిన పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భైంసా, తానూర్, లోకేశ్వరం మండలాల విద్యాధికారులు ఎ.సుభాష్, బాశెట్టి నరేందర్, చంద్రకాంత్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి బీవీ.రమణరావ్, ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు బాజిరెడ్డి, గంగాధర్, రిటైర్డ్ డీఎఫ్‌వో దత్తురామ్ పాటిల్, బీజేపీ ప్రతినిధి సోలంకే భీంరావ్ పాటిల్‌లు మాట్లాడుతూ దశాబ్ద కాలంగా అనసూయ పవార్ ట్రస్టు విద్యార్థులను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయంగా ఉన్నాయని కొనియాడారు. విద్యార్థులకు ఎమ్మెల్యే రామారావ్ పాటిల్ సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. ఇందులో విద్యార్థులు, వారి తల్లితండ్రులు, పలువురు పాల్గొన్నారు.



విద్యార్థులతో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్

కొనసాగుతున్న హరినామ సప్తాహ

కుభీర్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్డి(కే) గ్రామంలో సోమవారం హరినామ స్మరణ మార్మోగింది. గ్రామంలోని దక్షిణ ముఖి హనుమాన్ ఆలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామసప్తాహ ముగిసింది. ఈ సందర్భంగా గ్రామంలోని హనుమాన్, రాజరాజేశ్వర ఆలయంలోని దేవతామూర్తులకు ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం ఉత్సవ మూర్తులతో గ్రామంలోని ప్రధానవీధుల గుండా భజనలు, భక్తి సంకీర్తనలు, సంస్కృతిక మంగళహారతులతో ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సాయినాథ్, నాయకులు సాతం రవికుమార్, గంగాధర్, మాజీ సర్పంచ్ ఆకుల గంగాధర్, గ్రామస్థులు ఉన్నారు.



శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్థులు

పప్పు పాత్రలో పడి చిన్నారికి తీవ్రగాయాలు

నర్సాపూర్(జి), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో సోమవారం దీపావళి పండుగ వేళ విషాదం చోటుచేసుకుంది. పాఠశాలలో వంట పనులు చేస్తున్న కార్మికురాలు దివ్య వెంట ఉన్న ఆమె నాలుగేళ్ల కూతురు శాన్విక ప్రమాదవశాత్తు వేడి పంప్పు పాత్రలో పడింది. దీంతో చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన చిన్నారి శాన్వికను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రికి తరలించినట్లు డీఈవో తెలిపారు. చిన్నారికి ప్లాస్టిక్ సర్జరీ చేయాల్సి ఉందని, సర్జరీ పూర్తయ్యే వరకు వారం రోజులపాటు ఇన్ఫెక్షన్ ప్రమాదం ఉంటుందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం శాన్విక ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటోందని డీఈవో పేర్కొన్నారు. తాము పేద కుటుంబానికి చెందినవారమని, వైద్యం ఖర్చులకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

అధికారుల భద్రత చర్యలు

ఈ ఘటనపై డీఈవో స్పందించి జిల్లాలోని 18 కస్తూర్బా పాఠశాలల స్పెషల్ ఆఫీసర్లను తక్షణమే అప్రమత్తం చేశారు. వంట గదిలోకి చిన్నారులు రాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వడ్డించే సమయంలో విద్యార్థులకు హాని కలుగకుండా భద్రత చర్యగా ఇనుప జాలీలు (గ్రిల్స్) ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాఠశాలలో ఇలాంటి దుర్ఘటన పునరావృతం కాకుండా అధికారులు భద్రత చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

రైతులను నిండా ముంచుతున్న వర్షాలు

» కుంటాలలో వర్షం.. తడిసిపోతున్న దిగుబడులు

కుంటాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అసలే కష్టాల్లో ఉన్న రైతులను వర్షాలు వెంటాడుతూనే ఉన్నాయి. కుంటాల మండలంలో సోమ, మంగళవారం వర్షం కురిసింది. వర్షాలకు కల్లాలపై ఆరబెట్టిన సోయా తడిసిపోతోంది. దీంతో రైతులు కల్లాల వద్దనే నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు పంటలను దళారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఇదే అదునుగా ఇష్టారీతిన పంట ధరను తగ్గిస్తూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం మండలంలో రైతులు సోయా పంట కోసి ఆరబెడుతున్నారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని రైతులు పేర్కొంటున్నారు.



కల్లూరులో సోయా దిగుబడిపై కప్పిన టార్పలిన్లు

మూతపడిన కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను పునః ప్రారంభించాలి

» మంత్రి అడ్లూరికి ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి విజ్ఞప్తి

భైంసా,అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ యువత అభ్యున్నతి కోసం భైంసా, ముథోల్ కేంద్రాలలో మూతపడ్డ కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను పున:ప్రారంభించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కలిసి సంబంధిత విషయంలో వినతి పత్రం అందచేశారు. శిక్షణ కేంద్రాలను ప్రారంభిస్తే మైనార్టీ యువతీ,యువకులు సాంకేతిక రంగంలో శిక్షణను అందించి వారి ఉద్యోగ,ఉపాధి అవకాశాలకు మార్గం చూపినట్లవుతుందని పేర్కొన్నారు. గతంలో సంబంధిత కేంద్రాల ద్వారా కంప్యూటర్ శిక్షణను పొందిన మైనార్టీ యువత పలు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకొని జీవితాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశా రు. మైనార్టీ యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని శిక్షణ కేంద్రాలను పున ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు మైనార్టీ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ సానుకూలంగా స్పందించారని, కేం ద్రాల పున: ప్రారంభానికి అంగీకరించారని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఇక్కడి విలేకరులకు ఫోన్‌ద్వారా మాట్లాడి తెలిపారు. అంతేకాకుండా వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి నియోజక వర్గ పరిధిలో సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తిచేసినట్లుగా వెల్లడించారు. త్వరలోనే నియోజకవర్గ వ్యాప్తంగా సోయా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని విఠల్‌రెడ్డి తెలిపారు.



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వినతి పత్రం అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి

నిర్మల్‌రూరల్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి అమ్మవారిని దీపావళి సందర్భంగా దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నట్లు మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంతోషంగా ఉందని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో ప్రజలందరూ సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరినట్లు తెలిపారు.

సబ్‌స్టేషన్‌ను సందర్శించిన ఆర్జీయూకేటీ విద్యార్థులు

బాసర, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ బాసర ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ట్రిపుల్‌ఈ) విభాగం మూడో సంవత్సరం విద్యార్థులు మంగళవారం క్యాంపస్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. విద్యుత్ వ్యవస్థలు, సబ్‌స్టేషన్ కార్యాకలాపాలపై ఆచణాత్మక జ్ఞానాన్ని అందించడానికి ఈ క్షేత్ర సందర్శనను నిర్వహించారు. ఇందులో 180మంది విద్యార్థులు పాల్గొనగా, హెచ్‌వోడీ డాక్టర్ భుక్యభావ్‌సింగ్ ఆధ్యాపకులు వారికి సాంకేతిక వివరాలను వివరించారు. సైద్ధాంతిక జ్ఞానాన్ని ఆచరణాత్మక అనుభవంతో జోడించడానికి సందర్శనలు అవసరమని పేర్కొన్నారు.

మనస్థాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్(జి), అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన కుమ్మరి సుభాష్(55) అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో మనస్థానికి గురై మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొద్దికాలంగా అనారోగ్య సమస్యలతోపాటు ఆర్థిక ఇబ్బందులతో సుభాష్ బాధపడ్డాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 6గంటల ప్రాంతంలో అయన ఇంట్లోనుంచి బయటకు వెళ్లి గొల్లమాడ గ్రామశివారులోని వాగు రోడ్డుకు సమీపంలో ఉన్న చెట్టుకు సుభాష్ ఉరి వేసుకొని చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. మృతుడి భార్య కుమ్మరి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఆదివాసీ సంప్రదాయాలను భావితరాలకు అందించాలి



గుస్సాడీల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ



గుస్సాడీలతో కలిసి నృత్యాలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ/ఆదిలాబాద్(తాంసి)/బోథ్/ఆదిలాబాద్(సిరికొండ)/భీంపూర్/తలమడుగు,అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సాంప్రదాయాలను భావితరాలకు అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివాసీల పెద్ద పండుగగా జరుపుకునే దీపావళి పండుగ సందర్భంగా ఆదివాసులు ఘనంగా జరుపునే దండారి పండుగ సందర్భంగా నేరడిగొండ మండలంలోని యాపల్‌గూడ, రోల్‌మామడ, రెంగన్వాడీ, చించోలి,గాజిలి, తలమడుగు మండలంలోని పల్లిబి, మదన పూర్, బరంపూర్, జైనూర్‌పల్లి, గుడిహత్నూర్ దారామడుగు, తాంసి మండలంలోని లింగూగూడ గ్రామాల నుంచి గుస్సాడీలు ఆదివారం నేరడిగొండ మండల కేంద్రములోని బోథ్ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నివాసం వద్ద సాంప్రదాయపు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సైతం పాల్గొని గుస్సాడీ వేషధారణతో నృత్యాలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఆదివాసులు ఎంతో ఘనంగా జరుపుకునే దండారి పండుగకు గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక దండారికి రూ.10 వేలు అందజేశారని కానీ ఈ ప్రభుత్వం దీపావళి వచ్చిన కూడా చెక్కులు ఇంకా అందజేయలేదని అన్నారు. ప్రభుత్వం మోసాలు ఆపి త్వరగా దండారి చెక్కులు అందజేయాలని డిమాండ్ చేశారు.

గిరిజనుల సంక్షేమం కోసం ప్రత్యేక కృషి : బోథ్ ఎమ్మెల్యే

తాంసి గిరిజనుల సంక్షేమం కోసం తనవంతు ప్రత్యేకంగా కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గుస్సాడీ ఉత్సవాలలో భాగంగా మంగళవారం మండలంలోని అంబుగావ్, అట్నం గూడా గ్రామాలలో గిరిజనుల గుస్సాడీల కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంప్రదాయ బద్ధంగా నిర్వహించే గుస్సాడి కార్యక్రమాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రతి గిరిజనుడు విద్యావంతుడు అయినప్పుడే కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతున్న విషయాన్ని గమనించాలన్నారు. బోథ్ నియోజకవర్గంలోని గిరిజన తండాలన్నింటిలో తాను ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నానని పేర్కొన్నారు.

దండారి ఉత్సవాలకు చెక్కులు అందించలేని ప్రభుత్వం

సోనాల మండలంలోని ఆదివాసీ గిరిజన గూడేలైనా లేండిగూడ మహదుగూడ జైతుగూడ, నాగుగూడ తదితర గ్రామాల్లో మంగళవారం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పర్యటించారు. ఈ సందర్భంగా గుస్సాడిలతో ఆత్మీయ సమ్మేళనం గావించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గుస్సాడీ బృందాలకు రూ.10000చొప్పున ఆర్థిక సాయం అందించే వారిని ప్రస్తుతం పాలకులు గుస్సాడీలకు చెక్కులు ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం బోథ్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు అభిలాష్, సుధీర్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ భీమ్రావు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆదిలాబాద్(సిరికొండ) ఆదివాసీ గిరిజనులు అత్యంత వైభవంగా జరుపుకునే దండారి వేడుకలు దీపావళి వేడుకకు కొత్త శోభను తెచ్చిపెట్టాయి.మహిళలు రేలా రేలా పాటలతో గుంపులుగా చాచోయ్ నృత్యాలతో అందరినీ అలరిస్తున్నారు. దీంతో ఆదివాసీ పల్లెలన్నీ పండగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈసందర్భంగా మండలంలోని ముత్నూర్ గ్రామంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో మెండపెల్లి గ్రామానికి చెందిన గుస్సాడీ దండారీలు తమ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విజయ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆమెపేర్కొన్నారు. ఆదివాసీ సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయినిలు వైస్ ప్రిన్సిపాల్ విజయ, సౌమ్య, రజిత,నాగమ్మ,గౌతమీ,ప్రతిభ,ఎంకవ్వ,రాధ,ఆరాధన,జ్యోతి,సతీష్,మెండపెల్లి, యువతీ, యువకులు,విద్యార్థులు పాల్గొ న్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ విజయ, పెద్దలు



నిపానిలో దండారిలతో కేమా శ్రీకాంత్

దండారి ఉత్సవాల్లో కేమా

భీంపూర్ మండలంలో నిపాని గ్రామంలో మంగళవారం ఆదివాసి గిరిజనులు నిర్వహిస్తున్న దండారి ఉత్సవాల్లో బీఆర్ఎస్ నాయకుడు న్యాయవాది కేమా శ్రీకాంత్ నాయకులతో కలిసి పాల్గొన్నారు. గుస్సాడి బృందాలతో కలిసి లయబద్ధంగా నృత్యాలు చేశాడు. గత ప్రభుత్వ హయాంలో గుస్సాడి బృందాలకు పది వేల వంతున ఆర్థిక సహాయం అందజేశారు.ఆయనతో కునార్పుఅశోక్, కేమారాజన్న,జిట్ట ప్రణీత్‌రెడ్డి, హన్మండ్లు, మల్లెల స్వామి, సందీప్ తదితరులు ఉన్నారు.

గిరిజనుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

తలమడుగు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఆదివాసి గిరిజనులను అన్ని రంగాలో అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి అన్నారు.గత ప్రభుత్వ హయాంలో గిరిజనులకు గిరిజన బందు ఇస్తా నని చెప్పి మోసం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.



ఆదివాసీలతో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

» ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా



రాయిగూడలో మాట్లాడుతున్న కలెక్టర్

ఆదిలాబాద్(సిరికొండ),అక్టోబరు21(ఆంధ్రజ్యోతి):ఆదివాసీ గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను భావితరా లకు అందించాలి అని జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం మండలంలోని రాయిగూడ గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన దండారీ వేడుకల కు ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా హాజరై మాట్లాడారు. ఈ సందర్భం గా ఏర్పా టు చేసిన సమావేశంలో కలెక్టర్ రాజార్షీ షా మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతిని, సంప్రదా యాలను కాపాడుతూ, వాటిని భావితరాలకు అందించాలని పిలుపు నిచ్చారు. ఈవేడుకల్లో వారు పా ల్గొని, కోలాటం ఆడుతూ సందడిచేశారు.అనం తరం ప్రభుత్వ ప్రా థమిక పాఠశాల పొన్న గ్రామానికి చెందిన హెచ్‌ఎం సూర్యప్రకాష్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వం విద్యా ర్థులకు మధ్యాహ్న భోజన సన్న బియ్యం,పాఠశాల నిధులను పక్కదారి పట్టిస్తూ.. నిధులను స్వంతానికి వాడుకునేవాడని విధులకు సైతం సక్రమంగా హాజరుకావ డం లేదని అట్లాంటి హెచ్‌ఎంనీ బదిలీచేసి, మరొ కరిని పంపిం చాలని కలెక్టర్‌కు కలిసి వినతి పత్రం అందజే శారు. కార్యక్రమంలో స్రామాట్ అశోక్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముస్తపురే అశోక్,ఎస్సీఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాబాయి, తహసీల్దార్ తుకారాం, ఆశ్ర మ ఉన్నతహెచ్‌ఎం ఆత్రం భాస్కర్, ఉపాధ్యా యులు, మాజీ సర్పంచ్ జుగ్నక్ కృష్ణ, గ్రామ పటేల్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కావెంజర్ జీతం కాజేసిన ఘనుడు



పొన్నలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో

ఆదిలాబాద్(సిరికొండ),అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్న గ్రామంలో మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్కావెంజర్‌గా విధులు నిర్వహిస్తున్న మనోహర్ జీతం డబ్బులను ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాష్ కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.స్కావెంజర్ మనోహర్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గత కొన్నేళ్లుగా సిరికొండ మండలంలోని పొన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్కావెంజర్‌గా విధులు నిర్వహిస్తున్న మనోహర్‌కు ప్రతీ నెలా రూ.8వేలు ప్రభుత్వం నుంచి జీతం డబ్బులు విడుదలవుతున్నా..తనకు ఇవ్వ కుండా వెట్టి చాకిరీ చేయిస్తూ.. సంవత్సరానికి రూ.12 వేలు మాత్రమే చెల్లిస్తున్నాడనీ, మధ్యాహ్న భోజనం కోసం విద్యార్థులకు ప్రభుత్వం సరాఫరా చేస్తున్న సన్నబియ్యం కూడాపక్కదారిపట్టిస్తున్నారు అని ఆరోపించారు. రికార్డుల్లో మాత్రం తప్పుడు బిల్లులు సృష్టించి ఉన్నతాధికారుల కళ్లుగప్పి ఆ డబ్బులను తన సొంత పనులకు వాడుకుంటున్నాడని తెలిపారు. ఇదే విషయమై మంగళవారం విధులకు హాజరైన ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాష్‌ని గ్రామస్థులు మా పాఠశాలకు రావొద్దంటు అడ్డుకున్నారు. ఈ విషయమై గ్రామస్తులు ఎంఈవో సునీల్ దృష్టికి తీసుకెళ్లారు. ఎంఈవో, గ్రామస్తులు పాఠశాల రికార్డులను, పరిశీలించి ఆయా తీయగా ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాష్ తన తప్పుని ఒప్పుకుని స్కావెంజర్ మనోహర్‌కు రూ.60 వేలను చెల్లిస్తానని ఒప్పుకున్నారు. పాఠశాల విద్యార్థులకు కూడా సరైన విద్యను అందించడం లేదని, ఇలాంటి ప్రధానోపాధ్యాయు డు తమకు అవసరం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పాఠశాలలో... ఇప్పుడు ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంతో గ్రామస్థులు వెంటనే సూర్య ప్రకాష్‌ని తమ పాఠశాల నుంచి వేరే చోటికి పంపించి, విద్యార్థుల భవిష్యతును దృష్టిలో ఉంచుకుని మరో ఉపాధ్యాయుడిని పాఠశాలకు పంపించాలని ఎంఈవో సునీల్ దృష్టికి తీసుకెళ్లారు.

విక్రయాల్లో అన్నదాతకు తప్పని తిప్పలు



మొక్కజొన్నల నిల్వలపై కవర్ కప్పుతున్న రైతన్న



మాటేగాంలో నిర్మించిన గోదాము

» అవగాహన లోపంతో వినియోగానికి దూరం
» పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోలేని దుస్థితి



సోయా దిగుబడులను ఆరబెడుతున్న రైతులు

భైంసా, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశానికి పట్టెడు అన్నం పెట్టే రైతు పంటల సాగుకు నానా అవస్థ పడుతున్నారు.ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటను విక్రయించుకోవడానికీ అవస్థే... మార్కెట్ యార్డుల్లో కనీస సదుపాయాల్లేని దైన్యం... ఉన్న గోదాముల్లో ధాన్యం నిలువ చేసుకోలేని పరిస్థితి రైతు ఎదుర్కొంటున్నారు.గోదాములు నిరపయోగంగా మారినా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు.

వ్యవసాయమే ప్రధాన ఆధారం

ఇక్కడి ప్రజల జీవనోపాధికి వ్యవసాయమే ప్రధాన ఆధారం.వ్యయ,ప్రయాసాలను ఎదురుదీతూ కష్టనష్టాలను అధిగమిస్తూ రైతాంగం సాగుబడి చేస్తూ ఆశాజనకంగా పంటలు పండిస్తున్నారు. అయితే దిగుబడుల నిల్వాలు, విక్రయాల ప్రక్రియలో అన్నదాతలు అగచాట్ల పాలవు తున్నారు. సరియైన వసతులు,సౌకర్యాలు లేక ఇబ్బం దులు పడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మార్కెట్‌లో ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టక పోవడం వల్ల ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు వ్యవసాయోత్పత్తులు తడిసిపోతున్నాయి. దీంతో రైత న్నలకు కష్టనష్టాలు తప్పడం లేదు.

గోదాముల వినియోగంపై కొరవడిన అవగాహన

రైతులు తాము పండించిన పంటకు సరియైన గిట్టుబాటు ధర లేనప్పుడు ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి ప్రభుత్వం గోదాముల నిర్మించింది. జిల్లాలో నాబార్డు నిధుల ద్వారా 10, మార్కెటింగ్ నిధుల ద్వారా 21 కలిపి మొత్తం 31 గోదాములు న్నాయి.వీటన్నింటిలో 79 వేల మెట్రిక్ టన్నుల వ్యవసాయోత్పత్తులను నిల్వ చేసుకునేందుకు వీలు ఉంది. గిట్టుబాటు ధర లేనప్పుడుగోదాముల్లో వ్యవసాయోత్పత్తులను నిల్వ చేసుకొంటే అన్నదాతకు రైతు బంధు పథకం కింద పంట ఉత్పత్తుల విలువలో 75శాతంరుణ సదుపాయం కూడా కల్పిస్తారు. దిగుబడు లను అమ్ముకొన్న తరువాత ఆరుణం చెల్లించవచ్చు అయితే గోదాముల వినియోగంపై రైతుల్లో అవగాహన లేకపోవడంతో నిర్మించిన నాటి నుంచి అవి నిరుపయో గంగానే ఉన్నా యి. రైతులు మాత్రం మార్కెట్‌కు తెచ్చి న వ్యవసా యోత్పత్తులను ధర లేకున్నా వచ్చినకాడికి అమ్ముకొని పోతున్నారు.

అవగాహన లోపంతోనే సమస్యలు

జిల్లా రైతాంగానికి గోదాముల వినియోగానికి సంబంధించి ఎలాంటి అవగాహన లేకుండా పోయింది. ఇటు వ్యవసాయాధికారులు, ఆటు మార్కెటింగ్ అధికారులు రైతులకు అవగాహన కల్పించడంతో, చైతన్య పరచడంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.దీంతో రైతులు గోదాములను వినియోగించుకోవడం లేదు. ఫలితంగా ప్రకృతి పరిహారం చేసిన సందర్భంలో అగచాట్ల పాలవుతున్నారు.

ప్రచారం కల్పిస్తాం



వ్యవసాయోత్పత్తులను గోదాములలో నిల్వగా ఉంచి రైతు బంధు ద్వారా రుణం తీసుకునే విధానాలపై ప్రచారం చేస్తాం. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల సమన్వయంతో వ్యవహరించి రైతులను చైతన్య పరుస్తాం.

సింథే ఆనంద్‌రావ్ పాటిల్,
చైర్మన్, ఏఎంసీ, భైంసా

గంగారాం కుర్మే మరణం సాహితీ లోకానికి తీరని లోటు



గంగారాం కుర్మే (ఫైల్)

నేరడిగొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):గంగారాం కుర్మే మరణం సాహితీ లోకానికి తీరని లోటని రచయితల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉదారి నారాయణ అన్నా రు. సోమవారం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ దళిత ప్రజా కవి గంగారం కుర్మే (79) మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్ర రచయితల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉదారి నారాయణ అయితారం ముచ్చట్ల సాహితీ సభ్యులు బొల్లారం బాబన్న, లక్ష్మీనారాయణ, రవికాంత్ జాదవ్, త్రివేణి, గడ్డం భీమ్ రెడ్డి, ఆడేల్లులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించి సంతాపం వ్యక్తపరి చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వారి మరణం సాహితీ లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. వారు రచించిన పునాదిరాయి, ముద్దుగుమ్మ,ధమ్మపతం, శిలాఫలకం, ఆనవాళ్లు తదితర కవిత్వం సాహిత్యంలో చెరుగని ముద్ర వేశాయని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియపరిచారు. కాగా గంగారాం కుర్మేకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. మంగళవారం టూ టౌన్‌లో వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల్‌గూడకు చెంది న అబ్దుల్ రషీద్ అలియాస్ రషీద్ ఖాన్ పాత వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. పోలీసులు ఓ వ్యక్తిని కొట్టినట్లు ఉన్న ఈ వీడియో పోస్టు చేయడంతో ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఎవరైన శాంతి భద్రతలు, విద్వేశాలను రెచ్చ గొట్టేలా పోస్టులు పెడితే శాఖ పరమై న చర్యలు తప్ప వ నిహెచ్చరించారు. గ్రూప్ అడ్మిన్‌లు ఇలాంటి పోస్టులు పెట్టకుండా జాగ్రత్తలు పా టించాలని సూ చించారు.

ఘనంగా గోమాత పూజలు



నైవేద్యం తినిపిస్తున్న నాగోరావు

బోథ్/నార్నూర్,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని ఆదివాసీ గూడాలలో మంగళవారం గోమాత పూజ కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దీపావళి అనంతరం ప్రతి యేడాది గోమాత పూజలు జరుపుకోవడం అనవాయితీగా వస్తున్నది. మరోవైపు గ్రామాల్లో గుస్సాడి కార్యక్రమాలు కొనసాగుతుండగా అవి బుధవారంతో ముగిసిపోనున్నాయి.నార్నూర్‌లో గోమాత సంప్రదాయం ప్రకారం పూజలు చేసి వారికి నైవేద్యం తినిపిస్తారు. మంగళవారం నార్నూర్ మండల మన్కాపూర్ గ్రామం గోవర్ధన్ గుట్ట మీద గ్రామస్థులు అందరు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మ ండల ఆదివాసీ జేఏసీ చైర్మన్ మెస్రం రూపు దేవు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగొరావు, రాయి సిడాం రూపుదేవు, మెస్రం మొతిరాం, మహిళలు పాల్గొన్నారు.

సీతాఫలం.. పోషకాలు అమోగం



గంపలో ఉన్న సీతాఫలాలు



సీతాఫలాన్ని విక్రయిస్తున్న అవ్వ

ముథోల్,అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సీతాఫలం... మధురమైన ఫలంగా, పోషకాల గనిగా చెప్పవచ్చు. గ్రామీణ ప్రాంతంలో వర్షాకాలం ముగియడం శీతాకాలం ప్రారంభమైన నుంచి విరివిగా లభించే మధుర ఫలాల్లో సీతాఫలం ఒకటి. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఈ పండ్లు విరివిగా లభిస్తాయి. సీతాఫలాన్ని రకరకాల పేర్లతో పిలుస్తుంటారు. కస్టర్డ్ ఆపిల్, షుగర్ ఆపిల్, స్వీట్ ఆపిల్ అని కూడా అంటారు. చూడటానికి నొక్కులు నొక్కులతో ఆకు పచ్చరంగులో గుండ్రంగా ఉంటోంది. దీని లోపల నల్ల గింజలతో తెల్లగా ఉండే గుజ్జు ఎంతో మధురంగా ఉంటుంది. ఈ పండును తినడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు నయం చేస్తుందన్న నమ్మకం బలంగా ఉంది. ఈ ఫలంలో ఉండే ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు రోగనిరోధక శక్తిని పెంచ డంలో సహరిస్తాయి. కంటి ఆరోగ్యం మెరుగుదలకు దోహదపడు తుందని గ్రామాల్లో పెద్ద మనుషులు చెబుతుం టారు. ఈ పండులో కొవ్వులు, క్యాల రీలు చాలా తక్కువ. అధిక మొత్తంలో ఉండే ఫైబర్ కడుపు నిండిన భావన కలిగేలా చేస్తుంది. త ద్వారా ఎక్కువ సమయం ఆహారం తీసుకోకుండా ఉం డి క్రమంగా బరువు తగ్గవచ్చు. సీతా ఫలంలో ఉండే విటమిన్ బీ6 కడుపుబ్బరం, అజీర్తి, అల్సర్లు వంటి సమస్యల నుంచి విముక్తి కలిగిస్తుంది. శరీరంలో మెగ్నీషియ లోపిస్తే గుండెపై ప్రతికూల ప్రభావం పడుతుంది.మెగ్నీషియం నిండి ఉన్న సీతాఫలం ఆ సమస్యను నివారిస్తుంది. ఇక ఇందులో ఉండే ఇతర ఖనిజాలు, విటమిన్ 'సి' రక్త ప్రసరణ వ్యవస్థను మెరుగు పరిచి గుండె ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. పీసీవోఎస్ ఉన్నవారిలో హార్మోన్ల అసమతుల్యత కారణంగా అలసట, నీరసం, మూడ్ స్వింగ్స్, చికాకు వీటన్నింటికీ ఐరన్ విరుగుడుగా పనిచేస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. సీతాఫలంలో అదిఎక్కువగా లభిస్తుంది. ఈ పండులోని ఫైబర్ మలబద్ధకాన్ని తగ్గించడంతో పాటు అనారోగ్య సమస్యలు తగ్గిస్తాయి. మార్కెట్‌లో రోడ్లకు ఇరువైపులా గుల్లల్లో పెట్టి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఒక సీతాఫలం పెద్దది రూ. 10-15 పలుకుతుంది. ప్రస్తుతం వీటి ధర అధికం ఉన్న సీతాఫలం ప్రియులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే ఈ చలికాలంలో పుష్కలంగా లభించే సీతాఫలాలు కూడా కొందరికి ఉపాధి నిస్తున్నాయి. చలి కాలం వచ్చిందంటే సీతాఫలాలు ఎక్కువగా లభిస్తాయి. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో లభించే ఈ సీతాఫలాలను పల్లె జనం గంపల్లో పెట్టుకొని పట్టణా లకు తీసుకువచ్చి విక్రయించి ఆదా యాన్ని పొందుతున్నారు.



మల్టీ జోన్-1 ఐజీ స్వాగతం పలుకుతున్న ఎస్పీ జానకి షర్మిల

శాంతి భద్రతల కోసం పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయం

» మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి

నిర్మల్ రూరల్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత కోసం పోలీసులు అహర్నిశలు కృషి చేస్తుండడం అభినందనీయమని మల్టీ జోన్- 1 ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయాన్ని మల్టీ జోన్- 1 ఐజీ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకీ షర్మిలని కలిసి జిల్లాలోని శాంతి భద్రతల పరిస్థితులు, నేర నియంత్రణ చర్యలు, పోలీస్ సిబ్బంది పని తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ జిల్లా పోలీస్ అధికారులతో సమావేశమై, అడిషనల్ ఎస్పీలకు, ఏఎస్పీలకు, ఇన్‌స్పెక్టర్లకు వివిధ అంశాలపై దిశానిర్దేశాలు జారీ చేశారు. జిల్లాలో శాంతి భద్రతలు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

24న మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ సమావేశం

నిర్మల్‌చైన్‌గేట్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24న మెదక్ జిల్లా చేగుంటలోని కర్నాలపల్లి గ్రామంలో గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగే సమావేశాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు అమరవేణినర్సాగౌడ్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ సిద్ధిరాములు గౌడ్‌లు పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రస్తుత ఆబ్కారీ విధానంపై చర్చ, రాష్ట్రప్రభుత్వం ఎన్నికలకు ముందుఇచ్చిన హామీలు అమలు, గీతకార్మికులపై ఎక్సైజ్ దాడులు, జనగామ జిల్లాకు పాపన్న జనగామ జిల్లాగా మార్చడం, పెండింగ్ గీతకార్మికుల ప్రమాద బీమా చెల్లింపులు, నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు.



• నక్సలైట్ల తూటాలకు బలైన పోలీసులు (ఫైల్)

అమరులారా.. మీ త్యాగం మరువం

ఓ వైపు ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ.. మరోవైపు విధుల నిర్వహణలో కచ్చితత్వాన్ని పాటిస్తూ.. ముష్కరుల దురాఘాతాలకు ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగాన్ని ఈ చరిత్ర ఎన్నటికి మరిచి పోదు. అమరులారా మీ త్యాగం మరువమంటూ సమాజం ఇప్పటికీ ఎలిగెత్తి చాటుతోంది. ప్రజలకు నిరంతరం భద్రత కల్పిస్తూ వారికి అండగా నిలుస్తున్న పోలీసులను సమాజ శత్రుమూకలు ప్రాణాలు తీస్తున్నా వెరవకుండా విధులను నిక్కచ్చిగా నిర్వహిస్తూ ప్రజా బంధువులుగా పోలీసులు నిలుస్తున్నారు.

» పోలీసుల త్యాగం చరిత్రలో సుస్థిరం
» అమరత్వానికి నిలువెత్తు సాక్ష్యం
» నక్సలైట్ల కాల్పుల్లో బలైన పోలీసులు
» 21 నుంచి జిల్లాలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

నిర్మల్,అక్టోబరు21 (ఆంధ్రజోతి): పోలీసు అమరుల త్యాగాలను స్మరించుకునేందుకు ఈనెల 21 నుంచి జిల్లాలో పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. పోలీసుల త్యాగాలను ఏటేటా స్మరించుకుంటూనే వర్తమాన, భవిష్యత్ తరాలకు ఆ పోలీసు త్యాగాల గుర్తులను పంచాల్సిన అవసరం ఉంది. పోలీసుశాఖ అమరులైన పోలీసు ఉద్యోగులను స్మరిస్తూనే వారి అంకితభావాన్ని ప్రస్తుత ఉద్యోగులకు సైతం వెల్లడిస్తూ ప్రజాపోలీసు వ్యవస్థను పటిష్టం చేస్తోంది. ముఖ్యంగా జిల్లాలో పెద్దసంఖ్యలో పోలీసు సిబ్బంది అప్పటి పీపుల్స్ వార్ నక్సలైట్ల దురాఘాతాలకు బలయ్యారు. అలాంటి వారంతా ఇప్పటివరకు అమరులుగానే కొనియాడబడుతున్నారు. అప్పట్లో పీపుల్స్‌వార్ నక్సలైట్లు జిల్లా అంతటా సమాంతర వ్యవస్థను నడిపారు. ఇటు ప్రజాప్రతినిధులకు అటు యంత్రాంగానికే కాకుండా పోలీసులకు సైతం సవాలు విసిరేవారు. అటవీ ప్రాంతాల్లోనే కాకుండా మైదానప్రాంతాల్లో అనేక దుశ్చర్యలకు పాల్పడుతూ సంఘ విద్రోహక చర్యలను నిర్వహించేవారు. జిల్లాలోని కడెం, పెంబి, దస్తూరాబాద్, ఖానాపూర్, మామడ, నిర్మల్, సారంగాపూర్‌లతో పాటు తదితర మండలాల్లో పీపుల్స్‌వార్ నక్సలైట్ల కార్యకలాపాలు అప్పట్లో ఉధృతంగా జరిగేవి. పీపుల్స్‌వార్ నక్సలైట్లు అమాయక ప్రజలకు అండగా ఉంటున్నామని చెబుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారన్న ఆరోపణలుండేవి. వీరి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకునేందుకు పోలీసులు అడవుల్లో కూంబింగ్‌లు చేపట్టి ఆదివాసీ జనానికి అండగా నిలిచేవారు. అయితే అప్పట్లో కడెం మండలంలోని అల్లంపెల్లి అడవుల్లో 19మంది పోలీసులను హతమార్చి మొట్టమొదటి భారీహింసాత్మక చర్యలకు పాల్పడ్డారు. ఈ ఘటన అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే సంచలనాత్మకంగా మారింది. ఈ ఒక్క ఘటనతో పోలీసులు భవిష్యత్‌లో ఎంత అప్రమత్తంగా ఉండాలనే అంశం తేటతెల్లమైంది. నాటినుంచి ప్రభుత్వం పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవడమే కాకుండా అమరుల పేరిట సంస్మరణ వారోత్సవాలను అట్టహాసంగా నిర్వహిస్తోంది.

ఆనాడు ఎర్రబడ్డ అడవి..

మారుమూల పల్లెల్లో శాంతి భద్రతల పరిస్థితులను పరిశీలించేందుకు వెళ్లిన పోలీసులపై పీపుల్స్ వార్ నక్సలైట్లు దాడి చేసి కాల్పులకు తెగబడ్డ ఘటన సంచలనం సృష్టించింది. 1987 ఆగస్టు 18న అల్లంపెల్లి గ్రామ సమీపంలోని అడవుల్లో కూంబింగ్‌కు వెళ్లిన పోలీసులపై నక్సలైట్లు కాల్పులతో దొంగదెబ్బ తీశారు. అనూహ్య ఘటనకు నివ్వెరపోయిన పోలీసులు తమ ప్రాణాలను బలిదానం చేశారు. మొత్తం ఈ ఘటనలో 10 మందికి పైగా పోలీసులు మరణించారు. గెరిల్లా తరహాలో దాడిజరిపి పీపుల్స్‌వార్ నక్సలైట్లు పోలీసులను కాల్చిచంపారు. దీంతో అక్కడి అడవులన్నీ ఎర్రబడ్డాయి. ఆ తర్వాత ఖానాపూర్ మండలంలోని సింగాపూర్ రహదారి అడవుల్లో 1989 లో కూడా పీపుల్స్‌వార్ నక్సలైట్లు డిటనేటర్లతో పోలీసు జీపును పేల్చివేశారు. ఈ ఘటనలో ఏడుగురు పోలీసులు అక్కడికక్కడే మరణించారు. అలాగే తర్లపాడ్ వద్ద కూడా ఓ జీపును పేల్చి వేయడంతో ఇద్దరు పోలీసులు మరణించారు. అలాగే పెంబి, నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌లను సైతం నక్సలైట్లు పేల్చివేసి పలువురు పోలీసుల మరణాలకు కారణమయ్యారు.

ఆనాటి అమరులు వీరే..

1987లో పీపుల్స్‌వార్ నక్సలైట్ల చేతిలో ప్రాణాలు కోల్పోయిన పది మందిలో ముగ్గురు ఎస్‌ఐ స్థాయి అధికారులు ఉన్నారు. కె.రాజన్న, వెంకట్రామ్ నర్సయ్య, ఎంఎ గఫార్‌లు ఎస్‌ఐ స్థాయి అధికారులు కాగా విఠల్, యండి. జాదవ్, రఘునాథ్, సత్యనారాయణ చారి, జగన్నాథ రావు, ముకుంద్‌రావు, అశోక్ గౌడ్‌లు కానిస్టేబుల్స్ కావడం గమనార్హం. వీరంతా ఒకేసారి ఒకే ఘటనలో నక్సలైట్ల చేతిలో హతమయ్యారు. అలాగే 1989లో పీపుల్స్ వార్ నక్సలైట్లు జీపును పేల్చివేసిన ఘటనలో ఎస్‌ఐ ఖాదర్‌ఉల్‌హక్, కానిస్టేబుళ్లు జమాల్, బాపురావు, ఎస్‌కే హైదర్, వేణుగోపాల్, మోహన్‌దాస్, భోజరాంలున్నారు. ఆ తర్వాత 1999లో తర్లపాడ్ వద్ద కూడా పోలీసుల జీపును పేల్చిన ఘటనలో అప్పటి ఎస్‌ఐ సింగం మల్లేష్‌తో పాటు కానిస్టేబుల్ పున్నంచంద్‌లున్నారు. వీరందరి పేరిట స్థానిక ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో స్మారకస్థూపం కూడా ఏర్పాటుచేసి ప్రతియేటా వారికి నివాళ్లర్పిస్తున్నారు.



లక్ష్మీదేవి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావ్‌పాటిల్

ఘనంగా దీపావళి వేడుకలు

భైంసా, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రజలు దీపావళి ఘనంగా జరుపుకున్నారు. భైంసాలో పట్టణవాసులు సోమవారం లక్ష్మీదేవి పూజలు, మంగళవార దీపావళి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాల మధ్య సాగింది. దీపాల వెలుగు, జిలుగుల్లో పట్టణం కొత్త శోభను సంతరించుకుంది. పిల్లలు, పెద్దలు అనే తేడాలేకుండా అందరూ కలిసి ఉత్సాహంగా టపాసులు కాల్చుతూ ఆనందంగా పండుగను జరుపుకున్నారు. వ్యాపారస్తులు తమ దుకాణాలు, సంస్థలను ఆరటి, మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం టపాలసులు, బాణసంచా కాలుస్తూ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

సారంగాపూర్: మండలంలోని బీరవెల్లి, స్వర్ణ, చించోలి, కౌట్ల(బి), బోరిగాం, గ్రామాలతోపాటు తదితర గ్రామాలలో సోమవారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ రంగురంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటుచేసి లక్ష్మీమాతకు పూజలు చేశారు. అనంతరం టపాసులు పేల్చారు. గ్రామాల్లో పండగ సందడి నెలకొంది.

కుంటాల: మండలంలో సోమ, మంగళవారాల్లో ప్రజలు దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం రాత్రి ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థల్లో లక్ష్మీ పూజలు నిర్వహించారు. మంగళవారం సైతం ప్రజలు పండుగను జరుపుకున్నారు. చిన్నారులు, పెద్దలు టపాకాయలు పేల్చి ఒకరికొకరు దీపావళి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



దీపావళి వేడుకలో చిన్నారులు

ముథోల్: ముథోల్‌తో పాటు ఆయా గ్రామాల్లో దీపావళి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. లక్ష్మీదేవి చిత్రపటానికి పూజలు చేసి చేశారు. విద్యుత్ దీపాలతో ఇళ్లు, వ్యాపారస్థల వద్ద ప్రత్యేక అలంకరణ చేశారు. పిల్లలు, పెద్దలు టపాసులు, పేల్చుతూ ఆనందంగా గడిపారు.

ఖానాపూర్: మండలంలో దీపావళి పర్వదిన వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లలో, వ్యాపార సముదాయాలలో సాయంత్రం లక్ష్మీపూజలు చేసిన అనంతరం టపాసులు పేలుస్తూ సందడి చేశారు.



తర్లపాడ్ గ్రామంలో టపాసులు పేలుస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి

» కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరిధాన్యం కొనుగోళ్లలో లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నిర్వహణ తదితర అంశాలపై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి కోత ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగిన సౌకర్యాలతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. సన్న, దొడ్డు రకాల ధాన్యం కోసం వేర్వేరు కేంద్రాలు ఏర్పాటుచేయాలని, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కేంద్రాల్లో తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు సమక్రమంగా పని చేస్తున్నాయో లేదో ముందుగా పరిశీలించాలని, ప్రతీ వేయింగ్ మిషన్‌కి తప్పనిసరిగా స్టాంపింగ్ చేయాలని ఆదేశించారు. టార్పాలిన్‌లు, గన్నిసంచులు సరిపడా అందుబాటులో ఉంచాలని, లారీలు, కూలీల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమచేయడంలో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. అవసరమైతే కంట్రోల్ రూమ్‌నెంబర్ 9182958858ను సంప్రదించవచ్చని తెలిపారు. రోజువారీగా వరి ధాన్యం కొనుగోలు వివరాలను తమకు అందజేయాలని కలెక్టర్ అధికారులను సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారి రాజేందర్, జిల్లా మేనేజర్ సుధాకర్, డీఆర్డీవో విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైజింగ్- 2047 సిటిజన్ సర్వేలో ప్రతిఒక్కరూ పాల్గొనాలి

తెలంగాణ రైజింగ్- 2047 సిటిజన్ సర్వేలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ రూపకల్పన కోసం ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్-2047 సిటిజన్ సర్వేకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వేలో కేవలం వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందజేశారని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం గతవారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25తో ముగుస్తుందని తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణ.జీవోవీ.ఇన్/తెలంగాణనరిసింగ్ అనే వెబ్‌సైట్‌ను సందర్శించి ప్రతిఒక్కరూ తమ అమూల్యమైన సలహాలు, సూచనలను పొందుపరచాలని పేర్కొన్నారు. శక్తివంతమైన తెలంగాణ నిర్మాణంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ కోరారు.

కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తుల స్వీకరణ

పెంబి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందపల్లి కేజీబీవీ పాఠశాలలో కెమిస్ట్రీ బోధించేందుకు దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు బీఈడీ, టెట్, పీజీ కెమిస్ట్రీ పాస్ అయిన వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకుందుకు ఈనెల 23 వరకు గడువు ఉందని, అర్హులైన అభ్యర్థులు కేజీబీవీ మందపల్లి పాఠశాలలో తమ సర్టిఫికెట్లను జత చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోలీసు అమరులకు ఘన నివాళి

▸ పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించిన ఎస్పీ జానకీ షర్మిల



పోలీసు అమరవీరుల స్థూపం వద్ద ఎస్పీ



బాధిత కుటుంబాలను ఓదారుస్తున్న ఎస్పీ



ఖానాపూర్‌లో అమరవీరుల స్థూపం వద్ద సీఐ

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ జానకీ షర్మిల అమరులకు నివాళులర్పించారు. పోలీస్ అమరవీరుల స్మారక స్థూపం వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ దేశ సరిహద్దు భద్రతలో సైనికుడు ఎంత ముఖ్యమో, రాష్ట్ర భద్రతలో పోలీస్ కూడా అంతే కీలకమని అన్నారు. పోలీస్ అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. ప్రజా అవసరాలు, సంరక్షణ కోసం ఏర్పడ్డ వ్యవస్థ పోలీస్ వ్యవస్థ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతోపాటు దేశ అంతర్గత భద్రత ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ఇలా ప్రతి సందర్భాల్లోనూ పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు. శాంతి భద్రతలు సక్రమంగా ఉంటేనే మారుమూల గ్రామాలకు కూడా అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అక్టోబరు 21 ప్రాముఖ్యతను వివరించారు. వీర మరణం పొందిన త్యాగమూర్తుల కుటుంబాల సంక్షేమాన్ని, వారికి ఆర్థిక పరమైన ప్రయోజనాలను కల్పించడం, ఆ కుటుంబాలకు మానసిక బలాన్ని అందించటమే పోలీస్ అమరవీరులకు మనం అందించే నిజమైన నివాళులని చెప్పారు. ఈ సందర్భంగా త్యాగమూర్తుల కుటుంబాల సభ్యులతో మాట్లాడారు. కుటుంబ పరిస్థితులు, వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సంవత్సరం అమరులైనవారి పేర్లను, రోల్ ఆఫ్ హానర్‌ను అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ ఐపీఎస్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, డీపీవో సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు త్యాగాల ఫలమే స్వేచ్ఛా జీవనం

ఖానాపూర్: నాటి పోలీసు అమరుల త్యాగాల ఫలమే నేటి స్వేచ్ఛా జీవనమని ఖానాపూర్ సీఐ అజయ్ కుమార్ కొనియాడారు. మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖానాపూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గల అమరవీరుల స్థూపం వద్ద ఖానాపూర్ పోలీసులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... ఖానాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు నక్సల్స్ దాడిలో 19 మంది పోలీసులు అమరులయ్యారన్నారు. విధి నిర్వహణలో పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలు ఎనలేనివని అభివర్ణించారు. కనీసం రోడ్డు సౌకర్యం లేని నాటి రోజుల్లో విధి నిర్వహణలో వారు చూపిన ధైర్యం మాటల్లో వర్ణించలేనిదన్నారు. అమరుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. పోలీసు అమరవీరుల ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్, కడెం, దస్తురాబాద్ ఎస్సైలు, ఏఎస్సైలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

పైలేరియా వ్యాప్తిని అంచనా వేయడానికి రక్త పరీక్షలు

» సర్వే స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ లక్ష్మణ్

నిర్మల్ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిర్దిష్టమైన ఇళ్లలో 20 సంవత్సరాల పైబడిన వారందరికీ పైలేరియా వ్యాప్తిని అంచనా వేయడానికి రక్త పరీక్షలు చేయడం జరుగుతుందని సర్వే స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. పట్టణంలోని రాంనగర్ ఆరోగ్య కేంద్ర పరిధిలో విజయనగర్ కాలనీలో ట్రాన్స్‌మిషన్ అసెస్మెంట్ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఒక ప్రాంతంలో టీఏఎస్‌లో పాస్ అయితే అక్కడ పైలేరియా ప్రసారం నిలిచిపోయిందని, తిరిగి వచ్చే అవకాశం చాలా తక్కువ అని తెలిపారు. ఈ సర్వుకు ఎంచుకున్న ప్రాంతాల్లోని ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవో డా. ప్రత్యూష, పిహెచ్‌ఎం రమణ, ఎంటీఎస్ మహేందర్, హెచ్‌ఏ రాజేశ్వర్, ఏఎన్‌ఎం నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



రక్త పరీక్షలను పరిశీలిస్తున్న సర్వే స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ లక్ష్మణ్



రాంపూర్‌లో దండారి ఉత్సవాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి

సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలి

» మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి

మామడ, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు తమ సంస్కృతి, సంప్రదాయాలని పాటించాలని, వాటిని ఆచరించాలని నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి అన్నారు. సోమవారం రోజున మండలంలోని రాంపూర్, వాస్తాపూర్ గ్రామాల్లో జరిగిన దండారి ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురం భీమ్, బిర్సాముండే, రాణి దుర్గావతి వంటి గొప్ప యోధుల ఆశయాలను కొనసాగించాలన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవమైనటువంటి పండుగలను భక్తి శ్రద్ధలతో పాటిస్తారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిరిజనుల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టాడని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సోనియా సంతోష్, నాయకులు రవితో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



సురేష్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

» అడ్వకేట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంత్రరాజం సురేష్

ఖానాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం తన వంతుగా కృషి చేస్తానని తెలంగాణ అడ్వకేట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంత్రరాజం సురేష్ అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ స్టేట్ అడ్వకేట్ ఫోరం ఎన్నికలలో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఖానాపూర్ బార్‌అసోసియేషన్ సురేష్‌ను మంగళవారం పలువురు న్యాయవాదులు అభినందించారు. ఈ సందర్భంగా సురేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఖానా పూర్ ప్రాంతం నుంచి తెలంగాణ స్టేట్ అడ్వకేట్ ఫోరం ఎన్నికలలో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సురే ష్‌కు కీలక బాధ్యతలు దక్కడం పట్ల స్థానిక న్యాయవాదులు సంతోషకం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఖానాపూర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నేరెళ్ల సత్యనారాయణ, న్యాయవాదులు షబ్బీర్ పాషా, కిషోర్ నాయ క్, షేక్ ఖదీర్, అశోక్, సలీం ఖాన్, వినయ్, వేణు, రవి, రాపెల్లి రాజు, తదితరులు ఉన్నారు.

దొరికిన ఫోన్‌ను అప్పగించి నిజాయితీ చాటుకున్న యువకుడు

కుభీర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన శశాంక్ తన నిజాయితీని చాటుకున్నాడు. మంగళవారం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రహదారిపై పడి ఉన్న మొబైల్ దొరకడంతో వెంటనే రూ.25వేల విలువ గల ఫోన్‌ను కుభీర్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ రాజన్నకు అందించాడు. అనంతరం పోలీసులు యువకుడికి శాలువాతో సత్కరించి అభినందించారు. పోలీసులు మోహన్‌జాదవ్, లక్ష్మణ్, మనీష్ తదితరులు ఉన్నారు.



యువకుడిని సన్మానిస్తున్న పోలీసులు